


పేటలో ఐటీ దాడులు

పేటలో అధికార పార్టీ నాయకుల ఇళ్లలో ఐటీ అధికారుల దాడులు కలకలం రేపాయి.

వివరాలు 6లో ▸



కొల్లాపూర్.. ప్రగతి జోరు

ఒకప్పుడు వెనకబడిన కొల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది.

వివరాలు 6లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.8 /21.7

ఉదయం, సాయంత్రం చలిగాలులు ఎక్కువగా వీస్తాయి. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దోపిడీ రాజ్యం పోవాలి

- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వనపర్తి: ఇందిరమ్మ రాజ్యం రావాలంటే.. ప్రస్తుతం ఉన్న దోపిడీ రాజ్యం పోవాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హెలిక్యాప్టర్‌లో వనపర్తికి చేరుకున్న ఆయన ముందుగా అభ్యర్థి ఇంటికి వెళ్లి అక్కడి నుంచి ర్యాలీగా రాజీవ్ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ షో కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఎందరో త్యాగాలతో వచ్చిన తెలంగాణలో పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ పాలనలో గులాబీ నాయకులు ప్రజాధనాన్ని తిమింగలాలుగా స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ప్రజల సమస్యలు పరిష్కరించటం కంటే ఆస్తులు పెంచుకోవటం, కుటుంబ సభ్యులందరికీ పదవులు కట్టపెట్టడంపై చొరవ చూపించారని, పదేళ్ల కాలంలో మంత్రులు, ఎమ్మెల్యేల ఆస్తులు రూ.వందల కోట్లకు పెరిగాయని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలు ధర్మం, అధర్మానికి మధ్యనే అనే విషయాన్ని ప్రజలు గుర్తించి కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. ఉద్యోగాల భర్తీ పేరుతో నిరుద్యోగులపై తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ కారణంగా చాలా మంది నిరుద్యోగులు తమ ప్రాణాలను వదిలేశారన్నారు. మరోసారి వారికి అధికారం కట్టబెడితే.. రాష్ట్ర భవిష్యత్‌ను నిరోధించటమే అవుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు వివరించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డి, అభ్యర్థి మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురునానక్‌కు ఘన నివాళి



వనపర్తిటౌన్: సిక్కు మత స్థాపకుడు, 10 మంది సిక్కు గురువుల్లో మొదటివారైన గురునానక్ జయంతి సిక్కు మతంలో చాలా పవిత్రమైన పండుగని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గురునానక్ 534 జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడారు. 1,469వ కార్తీక పౌర్ణమి రోజు గురునానక్ జన్మించాడని, ప్రతి సంవత్సరం ఇదే రోజు ప్రపంచమంతట ప్రార్థనలతో పర్వదినాన్ని వేడుకగా జరుపుకొంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, జిల్లా మైనార్టీ నాయకుడు బాలేమియా, నాయకులు యోసేపు, మురళీధరచారి, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘లార్జెస్ట్ ఫోక్ డ్యాన్స్’లో బన్నీ గ్రూప్‌నకు అవకాశం

కొత్తకోట: హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్‌ని మార్గదర్శి హైస్కూల్ మైదానంలో కీర్తి ఆర్ట్స్ అకాడమి డైరెక్టర్ బిందులేమా ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అఫీషియల్‌లో ‘జానపద నృత్య నీరాజనం.. లార్జెస్ట్ ఫోక్ డ్యాన్స్’ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోనే వనపర్తి జిల్లాలోని కొత్తకోటకు చెందిన బన్నీ మాస్టర్ డ్యాన్స్ గ్రూప్‌నకు అవకాశం వచ్చింది. 6 నిమిషాల 38 సెకండ్ల పాటు వెయ్యి మంది డ్యాన్సర్లు ఈ నృత్యంలో పాల్గొన్నారు. ఇందుకు గానూ ఎక్సలెన్సీ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీతగా బన్నీ మాస్టర్‌తో పాటు డ్యాన్సర్లను సత్కరించారు.







కోస్గిలో సభకు హాజరైన జనం

కేసీఆర్ పని దోచుకోవడం.. దాచుకోవడమే

కోస్గి, గద్వాల బహిరంగసభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

- ప్రాణాల విలువ తెలిసే సోనియా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది
- దేశం కోసం మా నానమ్మ ఇందిరమ్మ, నాన్న రాజీవ్‌గాంధీ ప్రాణాలు కోల్పోయారు
- రాష్ట్రంలో ప్రజలు పేదలుగానే ఉన్నారు.. కేసీఆర్ కుటుంబం మాత్రం రూ.కోట్లకు పగడలెత్తింది
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. మాఫియారాజ్యాన్ని తరిమికొడతాం

కోస్గి/గద్వాల రూరల్: ‘ఆనాడు దేశం కోసం మా నానమ్మ ఇందిరమ్మ.. నాన్న రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు.. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎందరో యువకులు, ప్రజలు ఆత్మబలిదానాలు చేసుకున్నారు.. ఆ కుటుంబాల బాధ, మనిషి ప్రాణం విలువ తెలిసిన వ్యక్తిగా తన తల్లి సోనియమ్మ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది.. కానీ, ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ దోచుకోవడం, దాచుకోవడమే చేశారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కోస్గి, గద్వాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడితే రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువతతోపాటు అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారని ఆశించి.. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే.. కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్, అతని కుటుంబమే బాగుపడి రూ.లక్షల కోట్లు దోచుకొని విలాసవంతమైన జీవితం గడుతున్నారని, పేదలు మాత్రం మరింత పేదలుగా మారారని దుయ్యబట్టారు. మొదటిసారి రేవంత్‌రెడ్డి నన్ను కలిసినప్పుడు ఎలాంటి పదవి అడగలేదని, గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజల కోసం తాను చేస్తున్న పోరాటం వివరించి.. రాష్ట్రంలో మార్పు కోసం, ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం మాత్రమే ఇవ్వాలని కోరారన్నారు. రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలపై ప్రేమాభిమానాలు ఉన్నాయని, ప్రజలకు సైతం రేవంత్ అంటే ఎంతో ప్రేమ ఉందనే విషయం తమకు తెలుసు అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, ఉపాధి అవకాశాలు లేక యువత ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసే పనిని మాత్రమే చెబుతుందని, ఇందుకు నిదర్శనమే కర్ణాటకలో అమలు చేస్తున్న హామీలు అని పేర్కొన్నారు. రాజస్తాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో సైతం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేసి అన్నివర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామన్నారు. తెలంగాణలో సైతం అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి జిల్లాకు ఒక ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభిస్తామన్నారు. దేశంలో సచివాలయానికి రాకుండా పదేళ్లు పాలించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

వందశాతం అమలు చేస్తాం..

కాంగ్రెస్ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు అసంపూర్తిగానే ఉన్నాయని, వాటిని కూడా వందశాతం పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రియాంకాగాంధీ చెప్పారు. ధరణి పోర్టల్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంట్లో అర్హులైన ఇద్దరు వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున పింఛన్ పథకాలు అమలు చేస్తామన్నారు. గద్వాలలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చేనేత పార్కు ఏర్పాటు చేసి చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. కోస్గి సభలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, పరిగి, తాండూరు అభ్యర్థులు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్‌కుమార్, యూసుబ్, పార్టీ మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, నాయకులు కిష్టప్ప, నరేందర్, హరి, భీంరెడ్డి, రాఘవరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి సభ సైడ్‌లైట్స్

- ప్రియాంకగాంధీ 4 గంటలకు సభావేదికపైకి చేరుకున్నారు.
- మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని స్వయంగా రేవంత్‌రెడ్డి ప్రియాంకగాంధీకి పరిచయం చేస్తూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారని, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అని తెలిపారు.
- ప్రియాంకగాంధీ ఏకధాటిగా 47 నిమిషాల పాటు ప్రసంగించారు.
- ముందుగా జైబోలో తెలంగాణ, మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామికి జై, రేణుక ఎల్లమ్మజీకి జై అంటూ ప్రజలచేత జేజేలు పలికించారు.
- ప్రియాంకగాంధీ రేవంత్‌రెడ్డి పేరు చెప్పగానే పెద్దఎత్తున అరుపులు, కేకలతో ప్రజలు నినాదాలు చేశారు.
- ‘మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి’ అంటూ సభకు వచ్చిన జనంతో ప్రియాంకగాంధీ అనిపించారు.
- సభ ముగియగానే రేవంత్‌రెడ్డి పేరుతో వచ్చిన డీజే పాటకు జనం కేరింతలతో డ్యాన్స్ చేశారు. దీంతో వేదికపై ఉన్న ప్రియాంక సైతం చప్పట్లు కొడుతూ సభికులను ఉత్సాహపరిచారు.



కోస్గి సభలో అభివాదం చేస్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ.. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే

రాష్ట్రంలో మాఫియాల రాజ్యం

రాష్ట్రంలో ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియా రాజ్యం నడుస్తోందని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. ఎన్నో చట్ట విరుద్ధ పనులతో దొరల పాలన సాగుతుందని విమర్శించారు. దోచుకున్న డబ్బుతో విచ్చలవిడిగా ఖర్చు చేసి అధికారంలోకి వస్తామన్న ధీమాలో కేసీఆర్ ఉన్నారని, మా నానమ్మ ఇందిరమ్మ చెప్పిన విషయం బాగా గుర్తుందని, ప్రజాస్వామ్యంలో ప్రజలే శక్తివంతులని, ప్రజలు అనుకుంటే ఏ శక్తి తట్టుకోలేదని, ఇదే నమ్మకంతో మీ ముందుకు వస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డితోపాటు నేను కూడా వేదికపై నిలబడి ఉన్నామని, మాకు ఇతర ధర్మాలు లేవని, సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వస్తున్నామని, ప్రజలు జాగ్రత్తమై అన్ని విధాలుగా ఆలోచించి పనిచేయని వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ మాఫియా, శ్యాండ్, వైన్ మాఫియాల భరతం పడతామని హెచ్చరించారు. అనంతరం ప్రజలకు అభివాదం చేస్తూ రేవంత్‌రెడ్డి పాటకు చప్పట్లతో ప్రజలను ఉత్తేజపరిచారు.

INTERVIEW

అభివృద్ధే పనితీరుకు ప్రమాణం

ఉద్యమనాయకుడిగా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశా..

- ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, సీసీఆర్ ఫండ్స్‌తో 64 మినీలిఫ్టులు
- నాలుగు దశాబ్దాల వనపర్తి రోడ్ల విస్తరణ కళ నెరవేర్చా..
- రూ.300 కోట్లతో జిల్లాకు తాగునీటి పైప్‌లైన్
- రూ.550 కోట్లతో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజీలకు భవనాలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



‘సాక్షి’ ఇంటర్వ్యూలో మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: వలసలు, కరువుతో అల్లాడుతున్న పాలమూరును పసిడి పంటలతో పనికోసం పాలమూరుకే వలసలు వచ్చేలా, వ్యవసాయమంటే పండగలా చేశాను. 2014లో స్వల్ప మెజార్టీతో ఓడినా.. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకు సాగునీరందించిన తర్వాతే నామినేషన్ వేయాలనే ఉక్కు సంకల్పం తీసుకుని రాత్రి, పగలు ఓ రైతులా.. ఓ ఇంజినీరులా.. ఉద్యమనాయకుడిగా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి రాష్ట్రాన్ని వ్యవసాయ ఉత్పత్తుల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపాను. రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని, వనపర్తి నియోజకవర్గాన్ని అన్నివిధాల చేసిన అభివృద్ధే నా పనితీరుకు ప్రమాణంగా భావిస్తాను. వనపర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ‘సాక్షి’ ఇంటర్వ్యూలో చెప్పిన ముఖ్యమైన అంశాలు ఆయన మాటల్లోనే..

లక్ష ఎకరాలకు సాగునీరు..

పక్కనే జీవనది కృష్ణమ్మ బిరబిరా పారుతున్నా.. నియోజకవర్గంలో సాగునీటి కటకటను ఉద్యమకాలంలో చూసి, ఇక్కడి రైతులు, ప్రజలు జీవనోపాధి కోసం బొంబాయి, హైదరాబాద్, పుణె లాంటి పట్టణాలకు వలసలు వెళ్తుంటే.. కళ్లకు నీళ్లొచ్చేవి. స్వరాష్ట్రంలో పాలమూరును వలసలు లేని జిల్లాగా చూడాలనే దీక్ష తీసుకుని కేఎల్ఐ, భీమా, జూరాల కాల్వలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ.. అవసరమైన చోట కొత్తగా కాల్వలు తవ్వించి, ముళ్లచెట్లతో కనిపించే గొలుసుకట్టు చెరువులకు పునర్జీవం తీసుకొచ్చి చెరువులన్నింటినీ సాగునీటి కాల్వలకు అనుసంధానం చేసి, ప్రతి చెరువును కృష్ణా జలాలతో నింపాం. రూ.20 కోట్లతో ఆరు చెక్‌డ్యాంలను నిర్మాణం చేసి భూగర్భజలాలను వృద్ధి చేసేందుకు కృషిచేశా. ఎత్తైన ప్రాంతాల్లోని గ్రామాలకు సాగునీటి సమస్య ఉత్పన్నమైతే.. 64 మినీ లిఫ్టులను ఏర్పాటు చేసి 5,500 ఎకరాలకు సాగునీరిందించాను.

మెడికల్, నర్సింగ్ కాలేజీలు..

తొలి విడతలోనే.. జిల్లాకు మెడికల్, నర్సింగ్ కాలేజీలను మంజూరు చేయించడంతో పాటు పక్కా భవనాల కోసం ప్రభుత్వంతో రూ.550 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభింపజేశాను. జిల్లా విద్యార్థులకు ఇక్కడే ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలు ఉండాలని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ, దేశంలో మొదటి వ్యవసాయ డిగ్రీ మహిళా కాలేజీని మంజూరు చేయించాను. రెండేళ్లుగా పెద్దగూడెం గ్రామ శివారులో ప్రైవేటు భవనంలో తరగతులు కొనసాగుతున్నాయి.

లక్ష ఎకరాల్లో వరిసాగు..

2014 నాటికి జిల్లా వరిసాగు విస్తీర్ణం వానాకాలంలో 7,0430 ఉంటే.. సాగునీరు పుష్కలంగా రావటంతో ప్రస్తుతం జిల్లా వరిసాగు విస్తీర్ణం 1,63,715కు పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామపంచాయతీలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు రవాణా చార్జీల భారం సైతం తగ్గించాం. మద్దతు ధరతో రైతులు పండించిన ప్రతి బస్తాను కొనుగోలు చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేసి రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకున్నాం. వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేశాను.

రూ.77 కోట్లతో కర్నెతండా లిఫ్ట్..

నియోజకవర్గంలోని ఖిల్లాఘనపురం మండలంలో ఎత్తైన తండా ప్రాంతాలకు సాగునీరందించేందుకు సీఎం కేసీఆర్‌ను ఒప్పించి రూ.77 కోట్లతో కర్నెతండా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాం. అతి త్వరలో పూర్తి కానుంది.

ఇంటింటికీ తాగునీరు..

జిల్లా వ్యాప్తంగా 393 జనావాస ప్రాంతాలు, ఐదు మున్సిపాలిటీలకు ఇంటింటికి శుద్ధమైన తాగునీరందించేందుకు మిషన్ భగీరథ పథకానికి అనుసంధానంగా రాష్ట్రంలో సీఎం నియోజవర్గం గజ్వేల్ తర్వాత వనపర్తి నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూ.300 నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేయించాం. మరో నలభై ఏళ్ల వరకు ఎక్కడా తాగునీటి కోసం జిల్లా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే స్థితి లేకుండా ముందుచూపుతో పనులు చేయించాను.

రోడ్ల విస్తరణ కళ నెరవేర్చిన..

నాలుగు దశాబ్దాలుగా వనపర్తి పట్టణ ప్రజల కళగా మారిన రోడ్ల విస్తరణ పనులు, ప్రజలందరినీ ఒప్పించి నష్టపోయిన వారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇచ్చి రూ.49 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేయించాను. ఇరుకు రోడ్లతో ఎందరో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయి, దివ్యాంగులుగా మారిన పరిస్థితి ఇక ముందు ఉండొద్దని, ఎన్నోసార్లు ఆయా ప్రాంతాల వారిని కలిసి వారిని ఒప్పించి పనులు చేయించాను. అభివృద్ధిలో వనపర్తి జిల్లాను దక్షిణ తెలంగాణలో అగ్రగామిగా నిలిపేందుకు సదా కృషి చేస్తూనే ఉన్నాను.

8,728 మందికి సీఎం సహాయనిధి..

రాష్ట్రంలోనే అత్యధికంగా వైద్యం కోసం సాయం కోరిన 8,728 కుటుంబాలకు సీఎం సహాయనిధి నుంచి రూ.28.97 కోట్ల ఆర్థిక సాయం చెక్కులను అందించి ఆపదలోని వారిని ఆదుకునే ప్రయత్నం చేశాను. పార్టీలు, వర్గాలనే తేడా లేకుండా సాయం కోసం నా వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి శక్తివంచన లేకుండా సాయం అందించా.

ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్

వనపర్తి: పోలింగ్ రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ సూచించారు. సోమవారం చిట్యాల శివారులోని మార్కెట్ యార్డులోని గోదాంలో ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ రోజు సెక్టోరియల్ అధికారులకు, పీఓలకు, ఏపీఓలకు ఎన్నికల సామగ్రిని ఇచ్చేందుకు, పోలింగ్ తర్వాత ఈవీఎంలను రిసీవ్ చేసుకునే విషయంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. బారికెడ్లు, విద్యుత్ సరఫరా, టేబుల్స్, కౌంటర్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్, వాహనాల రవాణా తదితర పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి భోజనం ఏర్పాటు చేయాలని, సిబ్బందికి కావాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌ఓ ఎస్.తిరుపతిరావు, నోడల్ అధికారులు తదితరులు ఉన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నాం..

పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ చెప్పారు. సోమవారం ఈ విషయమై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని జిల్లాలో పోలింగ్ కోసం చేసిన ఏర్పాట్లను వివరించారు.

ఖోఖో జట్ల ఎంపిక

కందనూలు: రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను సోమవారం జిల్లాకేంద్రంలోని గీతాంజలి క్రీడా మైదానంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 212 మంది క్రీడాకారులు హాజరు కాగా.. బాలికల జట్టుకు 15 మంది, బాలుర జట్టుకు 15 మంది చొప్పున ఎంపికయ్యారు.

కొనుగోలు కేంద్రాల తూకాల్లో మోసాలు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తా తూకం పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో మోసాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్ అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి కొనుగోలు కేంద్రంలోని తూకాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రాల్లో ప్రతి 40 కిలోల బస్తాకు 41 కిలోల తూకం వేస్తున్నారని అన్నారు. అరకిలో ఖాళీ బస్తా తూకం పోను మరో అరకిలో వడ్లు ఎక్కువగా తీసుకుంటుండటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. జిల్లాలోని చాలా కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తరుగు తీస్తున్నారన్నారు. దీంతో రైతులు ప్రతి 40 కిలోల బస్తా వద్ద అర కిలోవడ్లు నష్టపోతున్నారన్నారు. ప్రతి లారీ లోడుకు సుమారుగా రూ.6 వేల విలువ గల వడ్లు రైతులు నష్టపోతున్నారన్నారు. తరుగుపై రైతులు ప్రశ్నిస్తే వారి ధాన్యాన్ని తూకం చేయడంలేదన్నారు. రైతులకు నష్టం జరగకుండా ధాన్యాన్ని తూకం చేయాలని, హమాలీలకు వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలస్వామి, మండల కమిటీ సభ్యులు పెద్ద హన్మంతు రైతులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ వేణు అన్నారు. సోమవారం మండలంలోని చిక్కేపల్లిలో కేంద్ర బలగాలు, పోలీసుల కవాతు నిర్వహించారు. ఎస్పీ ఆదేశానుసారంగా పోలీసుల కవాతు నిర్వహించామన్నారు. గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని, ఈ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు, పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు రిటైర్మెంట్ ఇవ్వాలి

కేసీఆర్ అవినీతిని ఎండగట్టి ప్రజల ముందు నిలబెడతాం

- బంగారు తెలంగాణకు బదులు అప్పుల కుప్పగా మార్చారు
- రాష్ట్రంలో రామరాజ్య స్థాపనకు కలిసిరావాలి
- గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్

పాలమూరు/అమరచింత: ష్ట్రంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఇంటికి పంపించి రిటైర్మెంట్ ఇవ్వాలని బీజేపీ నేత, గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్‌తో పాటు వనపర్తి జిల్లా అమరచింతలో బీజేపీ అభ్యర్థులు ఏపీ మిథున్‌రెడ్డి, జలంధర్‌రెడ్డిలకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పదేళ్లకాలంలో బంగారు తెలంగాణ బదులు అప్పుల తెలంగాణగా మార్చారని, మన కడుపులో ఉన్న బిడ్డ మీద కూడా రూ.1.25 లక్షల అప్పు పెట్టారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్షల కోట్లు కమీషన్ల రూపంలో దండుకున్నారని, కానీ, ప్రాజెక్టు మాత్రం నీట మునిగిందన్నారు. కేసీఆర్, కేటీఆర్ ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడితే కవిత లిక్కర్ దందాలో జైలుకు వెళ్లనుందన్నారు. నిరుద్యోగులు బలిదానంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం పదవులను దక్కించుకొని సంపాదనే ధ్యేయంగా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. నిత్యం మద్యం మత్తులో ఊగిసలాడే సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని తానే నడిపించానని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మద్యం మత్తులో ఇంట్లో పడుకోవడంతోనే సమయాన్ని గడిపాడని, ఎందరో మేధావులు తమ శక్తిమేరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తే కేసీఆర్ అదంతా తన క్రెడిట్ అని చెప్పుకొని అధికారం దక్కించుకున్నాడన్నారు.



మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న రాజాసింగ్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఒక్కటే..

రాష్ట్రాన్ని, దేశాన్ని నాశనం చేయడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తెరవెనుక ఒప్పందంతో ఎన్నికల బరిలో నిలిచాయని రాజాసింగ్ ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశానికి కాంగ్రెస్ పార్టీ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తీవ్రవాదం పెరిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే పరోక్ష కారణమన్నారు. దేశంలో హిందు రాజ్య స్థాపనను అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

■ ఎమ్మెల్యే అభ్యర్థి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఖతం కాబోతున్నాయని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పాలమూరు మరో పాతబస్తీ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ రాష్ట్రం పూర్తిగా అప్పుల పాలైందని, ఇక్కడ ఇచ్చిన గ్యారంటీలకు కూడా ఏమాత్రం గ్యారంటీ లేదన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి ఇల్లు బాగుపడుతుందన్నారు. ఆయా సభల్లో కర్ణాటక కోలార్ ఎంపీ మునిస్వామి, బీజేపీ నేతలు కొండయ్య, కృష్ణానాయక్, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, యాదయ్య, బుచ్చిరెడ్డి, వేణమ్మ పాల్గొన్నారు.

తెలంగాణలో బుల్డోజర్ బాధ్యత తీసుకుంటా

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి. .బీసీ ముఖ్యమంత్రి అయిన తర్వాత తాను బుల్డోజర్ బాధ్యత తీసుకుని బీఆర్‌ఎస్ పాలకులు చేసిన అవినీతి, భూ కబ్జాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఎంఐఎం చేతుల్లో కారు స్టీరింగ్ పెట్టారని, ఈ ఎన్నికల్లో ప్రజలు కారుకు ఓటు వేస్తే పాతబస్తీ నేతల చేతుల్లో పాలన ఉంటుందన్నారు. మత విద్వేశాలను రగిల్చి రాష్ట్రంలో హిందు ముస్లింల మధ్య అల్లర్లను సృష్టించి పబ్బం గడుపుకొనేందుకే ఓవైసీ సోదరులు రాజకీయ ముసుగు కప్పుకున్నారని ఆరోపించారు.

జంగ్ తెలంగాణ



రాజాసింగ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

బీసీని సీఎం చేస్తాం..

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ ఈ రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేశాడని, కానీ నరేంద్రమోదీ చెప్పిన మాటకు కట్టుబడి బీసీని ముఖ్యమంత్రి చేస్తారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని డిక్లేర్ చేసిన తర్వాత కేసీఆర్ కింద మంట మండుతుందన్నారు. పాలమూరులో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి బంగారు పాలమూరుగా అభివృద్ధి చేస్తారన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడానికి ప్రతి కార్యకర్త టెక్నాలజీతో యుద్ధం చేసి పాలమూరులో మిథున్‌రెడ్డిని, మక్తల్‌లో జలంధర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు.

అభివృద్ధి చేశా.. ఓట్లడుగుతా

- నేనేంటో కొల్లాపూర్ ప్రజలకు తెలుసు
- చిల్లర విమర్శలు చేసేవారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు
- కొల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

INTERVIEW

'నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రెండేళ్లపాటు కరోనా కష్టకాలం. మిగిలిన మూడేళ్లలో నియోజకవర్గం అభివృద్ధికి చేతనైనంత కృషిచేశా. నేనంటే పడని ఓ వర్గం సామాజిక మాధ్యమాల్లో చిల్లర విమర్శలు చేస్తుంటాయి. వాటికి నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. నేనేంటో ప్రజలకు తెలుసు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీల కోసం ప్రజలు నేరుగా నన్ను కలిసే స్వేచ్ఛ ఉంది. గత పాలకుల హయాంలో జరిగిన అభివృద్ధి.. ఈ అయిదేళ్లలో చేసిన అభివృద్ధిని ఓసారి బేరీజు వేసుకొని ఓట్లేయండి' అని కొల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. 'సాక్షి'తో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే.. - కొల్లాపూర్



రెండోసారి కచ్చితంగా గెలుస్తా..

ప్రత్యర్థులు భారీ మెజార్టీతో గెలిచే పరిస్థితులుంటే బీఆర్‌ఎస్ నాయకులపై గొడవకు ఎందుకు దిగుతారు. పోలీసుస్టేషన్ల ఎదుట ధర్నాలు ఎందుకు చేస్తారు. పోలీసు వాహనాలు ఎందుకు ధ్వంసం చేస్తారు. అంతా హైప్ క్రియేట్ చేస్తున్నారు. నేను ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై ప్రజలకు నమ్మకం ఉంది. ప్రజలు కూడా నాపై విశ్వాసంతో ఉన్నారు. నేను రెండోసారి కచ్చితంగా గెలుస్తా. రాష్ట్రంలోనూ బీఆర్‌ఎస్ పార్టీనే గెలుస్తుంది. ఈసారి గెలిస్తే నియోజకవర్గానికి మంజూరైన పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తిచేసేందుకు మొదటి ప్రాధాన్యం ఇస్తా. కొల్లాపూర్‌కు ఇంజినీరింగ్ కళాశాల, మరో జాతీయ రహదారి తీసుకొచ్చేందుకు కృషిచేస్తా. అభివృద్ధి విషయంలో నాకు ఒక ప్రణాళిక ఉంది. దాని ప్రకారం ముందుకు సాగుతా.

డబ్బులు వదిలేసుకోవాలా..

నాకు ఊహ తెలియనప్పుడే మా నాన్న సింగోటం వంతెన కట్టారు. ఆ కాలంలో డబ్బులు ఇవ్వకుంటే సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. వారు వడ్డీతో కలిపి లెక్క కట్టి డబ్బులు చెల్లించారు. రూ.5 లక్షలకు రూ.26 కోట్లు ఇచ్చారని జూపల్లి కృష్ణారావు చెబుతుంటారు. ఎందుకిచ్చారు అంత డబ్బు అని సుప్రీంకోర్టును ప్రశ్నించొచ్చు కదా. సుప్రీంకోర్టు తీర్పు మీద అప్పీలుకు ఎందుకు వెళ్లడం లేదు. కోకాపేటలో భూకబ్జా అంటారు. వాస్తవంగా ఆ భూమి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి సంబంధించింది. దాన్ని డెవలప్‌మెంట్‌కు ఓ సంస్థ తీసుకుంది. నేను అందులో ఓ ప్లాటు కోసం కొంత డబ్బు కట్టా. డెవలప్‌మెంట్‌కు తీసుకున్న సంస్థకు, భూ యజమానికి పంచాయితీ పడింది. నేను కట్టిన డబ్బుల కోసం అక్కడికి వెళ్తే కొందరి ప్రోద్బలంతో డెవలప్‌మెంట్ సంస్థ వారు నా మీద కేసు పెట్టారు. అంటే డబ్బులు కట్టి ఊరికే వదిలేసుకోమంటారా.?

ప్రజలకే జవాబుదారిని..

సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టేవారికి గ్రామాల్లో ఎంత ప్రజాబలం ఉందో అందరికీ తెలుసు. నన్ను తిట్టేందుకే కొందరికి మా ప్రత్యర్థులు నెలవారీ వేతనాలు ఇస్తున్నారు. నేను వాటి గురించి మాట్లాడి సమయం వృథా చేసుకోదల్చుకోలేదు. నేను ప్రజలకు మాత్రమే జవాబుదారిని. అలాగే మా ప్రధాన ప్రత్యర్థి భారీగా డబ్బులు వెదజల్లి నా వెంట ఉన్న నాయకులను కొంటున్నారు. నా వెంట ఉన్నప్పుడు వారిని అక్రమార్కులు, భూకబ్జాదారులు అన్నారు.. ఇప్పుడు వారు అవతలి వైపు వెళ్లాక సచ్ఛీలురు అయ్యారా? నాయకులు పోతే పోవచ్చు.. జనం మా వెంట ఉన్నారు.

నా హయాంలోనే పనులు

నా హయాంలో వాగులపై కట్టిన వంతెనలు, చెక్‌డ్యాంలు, రహదారుల నిర్మాణాలు చూస్తే అభివృద్ధి తెలుస్తుంది కదా. కొల్లాపూర్‌కు పాలిటెక్నిక్, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, పెద్దకొత్తపల్లికి జూనియర్ కళాశాల తీసుకొచ్చా. 167కే జాతీయ రహదారి మంజూరు చేయించా. కృష్ణానదిపై వంతెన నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పనులు చేశాం. గత పాలకుల హయాంలో జరిగిన అభివృద్ధి.. నా హయాంలో మూడేళ్లలో చేసిన అభివృద్ధిని మీరే పోల్చి చూడండి. నేనేం చేశానో తెలుస్తుంది.

అందుకే బీఆర్‌ఎస్‌లో చేరా..

గత పాలకుల అరాచకాలు, వేధింపులు తట్టుకోలేక ప్రజలు నన్ను గెలిపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాలేదు. మళ్లీ ఆ పాత నేత చేతుల్లోకే పవర్ వెళ్లింది. మూడు నెలల్లోనే నా అనుచరులను చాలా ఇబ్బందులు పెట్టారు. నా కేడర్‌ను కాపాడుకునేందుకు, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్‌లో చేరా. పార్టీలో చేరిన తర్వాత కేసీఆర్, కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా. నేను పార్టీ మారకుంటే నా కేడర్ అన్నివిధాలుగా ఇబ్బందులు పడేది.

భయపెట్టాలని చూస్తున్నారు

ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికలు ఎప్పుడొచ్చినా గొడవలు సృష్టించి సానుభూతి పొందాలనుకుంటారు. ఈసారి కూడా అదే జరుగుతోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. తప్పు ఎవరిదో వారే నిర్ణయం తీసుకుంటారు. మేము కొల్లాపూర్ ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నాం. ఘర్షణలతో ప్రజలను భయపెట్టాలని మా ప్రత్యర్థి చూస్తున్నారు.

కొల్లాపూర్.. ప్రగతి జోరు

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- 167కే జాతీయ రహదారి, ఐకానిక్ బ్రిడ్జితో ప్రత్యేక గుర్తింపు
- సాగు, తాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర బిందువు
- బీడు భూములు సస్యశ్యామలం

గ్రాండ్ రిపోర్ట్

కొల్లాపూర్: ఒకప్పుడు వెనుకబాటుతనానికి కేరాఫ్‌గా చెబుకునే కొల్లాపూర్ నియోజకవర్గం.. ఇప్పుడు అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. తాగు, సాగు నీటి ప్రాజెక్టులకు కేంద్ర బింధువుగా మారింది. లక్షన్నర ఎకరాల మేరకు వ్యవసాయ భూములకు సాగునీరు సమృద్ధిగా అందుతోంది. మారుమూల ప్రాంతంగా పేరుపడ్డ కొల్లాపూర్‌కు 167కే జాతీయ రహదారి నిర్మాణంతో ఆ పేరు చెరిగిపోనుంది. సోమశిల సమీపంలోని కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే కొల్లాపూర్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కనుంది. జాతీయ రహదారి, బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయితే పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా మారనుంది.

కొల్లాపూర్ మున్సిపాలిటీలో..

కొల్లాపూర్‌కు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కాగా.. తరగతులు ప్రారంభమయ్యాయి. కొత్తగా మరో పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది. మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో దళితవాడల అభివృద్ధి. అర్బన్ డెవలప్‌మెంట్ నిధులతో వార్డుల్లో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. 4వ వార్డులో నిర్మించిన అర్బన్ పార్కు అందరినీ ఆకర్షిస్తోంది. మిషన్ భగీరథ ద్వారా 90శాతం నివాసగృహాలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతోంది. ప్రధాన కూడళ్లలో ఆర్‌అండ్‌బీ సబ్‌డివిజన్ కార్యాలయం ఏర్పాటు, ఈదమ్మ గుడి, ఖాదర్‌పాషా దర్గా అభివృద్ధి వంటి పనులు చేపట్టారు. బీసీ, ఎస్సీల శ్మశానవాటిక కోసం 3 ఎకరాల స్థలం కేటాయించారు. చుక్కాయిపల్లిలో రూ.5.25కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేశారు.

పెంట్లవెల్లిలో..

రూ.9.65కోట్లతో మల్లేశ్వరం–పెంట్లవెల్లి మధ్యనున్న వాగుపై బ్రిడ్జి నిర్మించి వినియోగంలోకి తెచ్చారు. పెంట్లవెల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, చౌటచెరువుపై సమాజ్‌కట్ట విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రూ.9కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు రూ.1.50కోట్లతో పంచాయతీ భవనాలు, రూ.3.50కోట్లతో పాఠశాలల్లో మౌలికల సదుపాయాల కల్పించారు. గోప్లాపూర్, కొండూరు గ్రామాల్లో రూ.6.60కోట్లతో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. మల్లేశ్వరం, వేంకల్ ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం రూ.33కోట్లు మంజూరు చేసింది.

పాన్‌గల్‌లో...

పాన్‌గల్‌లో ప్రధాన రహదారి విస్తరించడంతో పాటు తెల్లరాళ్లపల్లి, రాయినిపల్లి గ్రామాల సమీపంలోని వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించారు. కొత్తపేట, పాన్‌గల్‌లో గోదాంల నిర్మాణాలు పూర్తయ్యాయి. కేతేపల్లి సమీపంలో మినీ బ్రిడ్జి నిర్మాణం తుది దశలో ఉంది. కిష్టాపూర్ సమీపంలో రామన్నగట్టు రిజర్వాయర్ నిర్మాణానికి నిధులను కేటాయించారు. పాన్‌గల్‌లో ఏడీఏ కార్యాలయం ఏర్పాటుతో పాటు మండల కాంప్లెక్స్ నిర్మించారు.



పాన్‌గల్ మండలం రాయినిపల్లి సమీపంలో వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం

చిన్నంబావిలో..

రూ.6,50కోట్లతో చేపట్టిన చిన్నమారూరు లిఫ్టు ఇరిగేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేయగా.. కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉంది. మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల ఏర్పాటు చేశారు. చిన్నదగడ, బెక్కెం గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించారు.

వీపనగండ్లలో....

వీపనగండ్ల నుంచి గోవర్ధనగిరి వరకు రూ.8కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టారు. రూ.5కోట్లతో తూము కుంట సమీపంలోని వాగుపై వంతెన నిర్మించారు. రూ.7కోట్లతో సంగినేనిపల్లి నుంచి పుల్గర్‌చర్ల వరకు రోడ్డు, వల్లభాపురం సమీపంలో రూ.3కోట్లతో వాగుపై చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టా రు. మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

పెద్దకొత్తపల్లిలో..

వేడుకరావుపల్లి తండా సమీపంలోని వాగుపై రూ.3కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. పెద్దకొత్తపల్లిలో రూ.1.50 కోట్లతో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణంతో పాటు దేవల్ తిర్మలాపూర్ నుంచి నాయినోనిపల్లి మైసమ్మ వరకు బీటీరోడ్డు పనులు చేపట్టారు. రూ.3కోట్లతో మైసమ్మ ఆలయం నిర్మించారు. పెద్దకొత్తపల్లికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కాగా.. తరగతులు ప్రారంభమయ్యాయి. బాచారం హైలెవల్ కెనాల్, పసుపుల బ్రాంచ్ కెనాల్ పనులకు ప్రభుత్వం రూ.55కోట్ల మేరకు మంజూరు చేసింది.

కోడేరు మండలంలో..

నర్సాయిపల్లి నుంచి తీగలపల్లి వరకు రూ.26 కోట్లతో బీటీరోడ్డు విస్తరణ చేపట్టారు. తీగలపల్లి–బావాయిపల్లి మధ్యనున్న వాగుపై రూ.80 లక్షలతో వంతెన నిర్మించారు. ఎత్తం సమీపంలోని మాలవాగుపై రూ.1.80 కోట్లతో బ్రిడ్జి నిర్మాణంతో పాటు రూ.56 కోట్లతో తీగలపల్లి నుంచి యాపట్ల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. కోడేరులో రూ.2.80 కోట్లతో, జనుంపల్లిలో రూ.1.50 కోట్లతో సీసీరోడ్లు నిర్మించారు. రూ.36కోట్లతో చెన్నారం నుంచి సింగోటం వరకు రోడ్డు నిర్మించారు. రూ.7కోట్లతో నాగులపల్లి నుంచి చిక్కేపల్లి తండావరకు, రూ.4కోట్లతో గుండె వాల్యానాయక్ తండా నుంచి మొండి తండా వరకు, రూ.4కోట్లతో కోడేరు నుంచి నాగులపల్లి వరకు బీటీరోడ్ల పనులు చేపడుతున్నారు. రూ.10కోట్లతో కోడేరు నుంచి పెద్దకొత్తపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.

అభివృద్ధి వేగవంతమైంది..



కొల్లాపూర్‌లోని దళిత వాడల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలను పూర్తిస్థాయిలో నిర్మించారు. 4వ వార్డులో నిర్మించిన అర్బన్ పార్కు అద్భుతంగా ఉంది. మా వార్డు అభివృద్ధికి చిరునామాగా మారింది. అక్కడక్కడ చిన్నచిన్న పనులను పూర్తి చేయాలి.

– జామ్ వేణు, కొల్లాపూర్


వాగు వద్ద ఇబ్బందులు పడేవాళ్లం



మల్లేశ్వరం–పెంట్లవెల్లి గ్రామాల మధ్య ఉండే వాగును వర్షాకాలంలో దాటేందుకు వీలయ్యేది కాదు. మల్లేశ్వరం, వేంకల్, ఎంగంపల్లి గ్రామాల ప్రజలు పెంట్లవెల్లికి రావాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వాగుపై బ్రిడ్జి నిర్మించడం సంతోషంగా ఉంది. మల్లేశ్వరం, వేంకల్ ఎత్తిపోతల పథకాలతో సాగునీటి సమస్య తీరుతుంది.

– భోగ్యం రాంచందర్‌నాయుడు, మల్లేశ్వరం

కొల్లాపూర్ రూరల్‌లో..



ముక్కిడిగుండం సమీపంలోని ఉడుముల వాగు, చుక్కాయిపల్లి సమీపంలోని సాకలిమడుగు వాగుపై బ్రిడ్జిలు నిర్మించారు. నార్లాపూర్ పెద్దవాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని వినియోగంలోకి తెచ్చారు. రామాపురం శివారులో 50పడకల ఎంసీహెచ్, కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. వంద పడకల ఆస్పత్రి పనులు కొనసాగుతున్నాయి. సింగోటం ఆలయ పునర్నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరయ్యాయి. సింగోటంలో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు. ఎల్లూరు రిజర్వాయర్‌కు తూము ఏర్పాటు చేయించారు. జీల్‌దార్‌తిప్ప చెరువుకు కేఎల్‌ఐ నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.32కోట్లు కేటాయించింది. ముక్కిడిగుండం, నార్లాపూర్ గ్రామాల మధ్యనున్న పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

కారు బోల్తా: ఒకరి మృతి

అడ్డాకుల: కర్నూల్ జిల్లాకు చెందిన రామయ్య(80) తన సోదరుడు, మరో డ్రైవర్‌తో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. శాఖాపూర్ దాటిన తర్వాత పాత రోడ్డు సమీపంలో కారుకు అడ్డుగా కుక్క వచ్చింది. దీంతో దాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ కారును పక్కకు తిప్పగా.. కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. అందులోని రామయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు. రామయ్యను ఎల్ అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మృతి చెందారని అక్కడి వైద్యులు చెప్పినట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలియజేశారు.

విద్యుదాఘాతంతో రైతు..

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని మనికొండలో పెండెం చంద్రశేఖర్(49) విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు ఆదివారం ఉదయం తన ఇంట్లో స్విచ్ బోర్డు వద్ద ఆన్‌ఆఫ్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు సర్పంచ్ గంగాపురి తెలియజేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకొని పేద కుటుంబానికి అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీడీ కార్మికులకు అండగా కాంగ్రెస్



భూత్పూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న



కురుమూర్తిలో ఆరు గ్యారెంటీల అమలు పత్రంతో ప్రమాణం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట/అడ్డాకుల/దేవరకద్ర/మదనాపురం/భూత్పూర్/కొత్తకోట: బీడీ కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని కాంగ్రెస్ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బీడీ ఫ్యాక్టరీ యాజమానుల ఆధ్వర్యంలో బీడీ కార్మికుల సమ్మేళనం నిర్వహించారు. గత కాంగ్రెస్ పార్టీ పాలనలో బీడీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ కార్మికులకు ఫించన్లు, ఇళ్ల నిర్మాణంతోపాటు వైద్యసేవలకు ఆర్థిక సాయాన్ని అందించిందన్నారు. అధికారంలోకి వస్తే కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి హరీష్‌రావు దిష్టి బొమ్మను దహనం చేశారు. బీడీ ఫ్యాక్టరీల యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

దోపిడి పాలనకు చరమగీతం పాడాలి..

రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీ పాలనకు చరమగీతం పాడాలని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. అడ్డాకులలో సోమవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్‌ఎస్‌పై ప్రజలు తిరగబడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇసుక, మట్టిదందాతో రూ.కోట్లు కూడగట్టారని విమర్శించారు. రైతు బంధు రాకుండా బీఆర్‌ఎస్ పార్టే అడ్డుకున్నదని ఆరోపించారు.

దాడి అమానుషం..

అలంపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్ ఇంటిపై రౌడీ మూకలు దాడి చేసి ఇంట్లో ఉన్న ఆయన భార్య మహాలక్ష్మిపై దాడి చేయడం అమానుషం అని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. తీవ్రంగా ఖండించారు. సోమవారం దేవరకద్రలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలంపూర్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు.

మదనాపురం మండల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని నాయకులు ప్రచారం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని సోమవారం కురుమూర్తి స్వామి సన్నిధిలో ప్రమాణ పత్రం రాశారు. ప్రమాణం చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

తీన్మార్ మల్లన్న సోమవారం రాత్రి భూత్పూర్ చౌరస్తాలో రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. కొత్తకోట పట్టణ కేంద్రంలో దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డితో కలిసి తీన్మార్ మల్లన్న రోడ్‌షో నిర్వహించారు.

ఐటీ దాడులతో కలకలం

14 గంటలు దాటిన కొనసాగిన తనిఖీలు

నారాయణపేట: ఎన్నికల వేళ నారాయణపేటలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ముఖ్య అనుచరులపై సోమవారం తెల్లవారుజాము నుంచి ఐటీ అధికారులు దాడులు చేపట్టడంతో పట్టణంలో కలకలం రేపినట్లయింది. మరో మూడు రోజుల్లో పోలింగ్ జరగనున్న సమయంలో నారాయణపేటలో ముగ్గురు బీఆర్‌ఎస్ నాయకుల ఇళ్లలో ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు చేయడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ దాడుల వెనక కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందా.. లేక బీఆర్‌ఎస్ కుట్ర చేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్ అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే ప్రచారం జరుగుతుంది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సంబంధించిన వ్యక్తులతో ముందు నుంచి ఆయనకు సత్సంబంధాలు ఉండటం.. అధికార పార్టీకి దగ్గర ఉంటూ.. కాంగ్రెస్ పార్టీకి ఫండింగ్ ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరో వ్యాపారి కాంగ్రెస్ పార్టీకి ఫండింగ్ ఇచ్చి ఉంటాడనే నేపథ్యం.. రిటైర్డ్ ప్రిన్సిపల్ చిట్టెం కుటుంబానికి విశ్వాసపాత్రుడు కావడంతో ఈ దాడులు అధికార పార్టీ నుంచే ఎవరో ఒకరు ఐటీ శాఖకు ఫిర్యాదు చేసి ఉండవచ్చనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

అసలు రహస్యం ఏమిటో..?

పేట నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య పోటీ నెలకొనేది. అయితే ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విషయంలో పార్టీ నిర్ణయం సరైంది కాదని కొంతమంది యువకులు పార్టీని వీడి.. గ్రూపు తగాదాలతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీంతో బీజేపీనే ఒకవేళ ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చి బుక్ చేసి ఉండొచ్చు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ ఐటీ దాడుల వెనక అసలు రహస్యం ఏమిటనేది తెలియాల్సి ఉంది.

భారీగా మద్యం పట్టివేత



చిన్నంబావి: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని దగడపల్లిలో రూ.4లక్షల విలువగల 47 కాటన్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు. దగడపల్లికి చెందిన వెంకట్రావు ఇంట్లో 29 కాటన్లు, కుమ్మరి రమేష్ ఇంట్లో 3 కాటన్లు, కుమ్మరి శంకరయ్య ఇంట్లో 17 కాటన్ల మద్యం నిల్వ చేయగా, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ కళ్యాణ్, స్పెషల్ పార్టీ పోలీస్ రవినాయక్, వీపనగండ్ల ఎస్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.